సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం ı 28 ı మార్చి ı 2023



బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸



వ్యవస్థల నిర్వీర్యం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ఈటల రాజేందర్ అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.4 /21.8

వాతావరణం

ఉదయం వేళలో ఆకాశం నిర్మలంగా ఉంది. అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది.

ఇఫ్తార్ 6-36
(మంగళవారం సాయంత్రం)

సహర్ 4-53
(బుధవారం తెల్లవారుజామున)

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

సల్కర్‌పేట్‌లో 'సిట్' ఆరా

గండేడ్: మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలపరిధిలోని సల్కర్‌పేట్‌లో సిట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం 10.30గంటలకు గ్రామానికి చేరుకున్న సిట్ అధికారులు ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతయ్య ఇంట్లో సోదాలు చేపట్టారు. తిరుపతయ్య తన సన్నిహితులైన టెక్నికల్ అసిస్టెంట్ల చేత ఏఈ పరీక్ష రాయించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అధికారులు తిరుపతయ్య ఇంటికి చేరుకున్న సమయంలో ఆయన సోదరుడు రాజు ఇంట్లో ఉన్నాడు. ఆయనతో దాదాపు అరగంట సేపు మాట్లాడి.. ఇంట్లో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. అనంతరం రాజును వెంటబెట్టుకొని సిట్ అధికారులు మహబూబ్‌నగర్‌లోని శేషాద్రినగర్‌లో తిరుపతయ్య ఉంటున్నఇంటికి వెళ్లినట్లు సమాచారం. కాగా పంచాంగల్ తండా, మన్యూర్‌పల్లి రూట్లో సిట్ అధికారులు వాహనం తిరిగినట్లు స్థానికులు చెపుతున్నా.. ఆ రెండు తండాల్లో అధికారులు ఆగలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

ఏఆర్ ఏఎస్పీగా సురేష్‌కుమార్



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా సురేష్‌కుమార్ సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. 1996 బ్యాచ్‌కు చెందిన సురేష్‌కుమార్ మొదట ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో ఆర్‌ఎస్ఐగా విధులు నిర్వహించారు. పలు జిల్లాల్లో చేసిన తర్వాత ఆర్‌ఐగా పదోన్నతి వచ్చి హైదరాబాద్‌లో పని చేశారు. నల్లగొండ జిల్లాలో డీఎస్పీగా పనిచేయగా ప్రస్తుతం ఏఎస్పీగా పదోన్నతి రావడంతో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా విధుల్లో చేరారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న సురేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ కె.నరసింహను కలిశారు.

290 మంది గైర్హాజరు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా సోమవారం ఇంటర్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు 32 పరీక్ష కేంద్రాలలో 9,590 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 9880 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా..అందులో 290 మంది గైర్హాజరయ్యారు.ఈ మేరకు పలు పరీక్ష కేంద్రాలను డీఐఈఓ వెంకటేశ్వర్లు, స్క్వాడ్ బృందం తనిఖీలు చేశారు.

పదోన్నతిపై ఏఎంసీ బదిలీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ) శంకర్‌సింగ్‌కు పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు. త్వరలోనే ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యే అవకాశాలున్నాయి.

వేరుశనగ క్వింటాల్ రూ.7,459

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,459, కనిష్టంగా రూ.3,600 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,181, కనిష్టంగా రూ.1,739, పెబ్బర్లకు గరిష్టంగా రూ.5,417, కనిష్టంగా రూ.4,970, కందులకు గరిష్టంగా రూ.7,869, కనిష్టంగా రూ.7,769, ఆముదాలు గరిష్టంగా రూ.6,242, కనిష్టంగా రూ.6,092, జొన్నలు గరిష్టంగా రూ.5,830, కనిష్టంగా రూ.5,603, ఉలువలు రూ.5,011, రాగులు రూ.1,701 చొప్పున పలికాయి.

ఆముదాల ధర రూ.6,189

దేవరకద్ర మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన ఈనామ్ టెండర్లలో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,189, కనిష్టంగా రూ.6,129 చొప్పున పలికాయి. మార్కెట్‌కు దాదాపు వంద బస్తాల ఆముదాలు అమ్మకానికి వచ్చాయి.

రైతు కంట్లో కారం..!

- దళారుల చేతిలో నిలువునా దగా
- తక్కువ ధరతో స్థానిక వ్యాపారుల కొనుగోళ్లు
- నడిగడ్డలో మిర్చి మార్కెట్ లేకపోవడమే కారణం
- కర్ణాటక, ఏపీకి రవాణా.. భారీగా పెరిగిన ఖర్చు
- రోజుల తరబడి పడిగాపులు.. తిండికీ తిప్పలు
- పెట్టుబడి కూడా రాని పరిస్థితి.. ఆందోళనలో రైతులు



జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం చెన్నిపాడులో మిర్చి పంటలో తాలు ఏరుతున్న మహిళలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఆరుగాలం శ్రమించి పండించిన మిర్చిని అమ్ముకునేందుకు రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. ఎర్రబంగారం క్రయవిక్రయాలకు సంబంధించి ఉమ్మడి పాలమూరు జిల్లాలో మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. పెరిగిన పెట్టుబడులకు తోడు తగ్గిన దిగుబడులతో ఆందోళనలో ఉన్న రైతాంగాన్ని.. దళారుల చర్యలు మరింతగా కుంగదీస్తున్నాయి. మార్కెట్ లేదనే సాకుతో వ్యాపారులందరూ కుమ్మక్కై అతి తక్కువ ధరతో కొంటూ నిలువు దోపిడీ చేస్తున్నారు. పెట్టుబడి సైతం రాని పరిస్థితుల్లో రైతులకు కన్నీళ్లే దిక్కవుతున్నాయి.

39 వేల ఎకరాల్లో సాగు..

ఉమ్మడి పాలమూరులో ప్రధానంగా నడిగడ్డగా పేరొందిన గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో వాణిజ్య పంటగా మిర్చిని అధికంగా సాగు చేస్తున్నారు. అక్కడి భూములు మిర్చి పంటకు అనుకూలంగా ఉండడంతో సొంతభూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులు ఎక్కువ సంఖ్యలో ప్రతి ఏటా మిర్చినే సాగు చేస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో 39 వేల ఎకరాల్లో మిర్చి సాగు కాగా.. గద్వాల జిల్లాలోనే 35,354ఎకరాల్లో సాగు కావడం విశేషం. ఈ సారి అధిక వర్షాలతో పాటు పంటను తెగుళ్లు ఆశించడంతో దిగుబడి భారీగా తగ్గింది.



గోకులపాడులో సింజంట బేడీ రకం మిర్చి సాగు

జిల్లాల వారీగా మిర్చి సాగు ఇలా.. (ఎకరాల్లో..)

జిల్లా	ఎకరాలు
జోగుళాంబ గద్వాల	35,354
వనపర్తి	2,776
నాగర్‌కర్నూల్	1,258
నారాయణపేట	236
మొత్తం	39,624 ఎకరాలు

పెరిగిన పెట్టుబడి.. తగ్గిన దిగుబడి

ఈ ఏడాది మిర్చికి నల్ల తామర సోకడంతో రైతులు లెక్కకు మించి పురుగు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడి వ్యయం అమాంతంగా పెరిగింది. ఎకరా విస్తీర్ణంలో మిర్చి సాగు చేస్తే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు మొత్తం కలుపుకొని సుమారు రూ.లక్ష వరకు ఖర్చు వచ్చిందని రైతులు చెబుతున్నారు. వాతావరణం అనుకూలించి ఎలాంటి తెగుళ్లు ఆశించకపోతే.. ఎకరాకు 18నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. తెగుళ్ల కారణంగా ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చినట్లు తెలుస్తోంది.

విధి లేక ఇతర రాష్ట్రాలకు.. మరింత భారం..

స్థానికంగా దళారులు దోపిడీ చేస్తుండడంతో అధిక సంఖ్యలో రైతులు మిర్చిని హైదరాబాద్, గుంటూరు, కర్ణాటకలోని బళ్లారి, హుబ్లీ మార్కెట్లకు వ్యయప్రయాసలకు ఓర్చి వాహనాల్లో తరలిస్తున్నారు. రవాణాకే పెద్ద ఎత్తు ఖర్చవుతుండడం రైతులకు అదనపు భారంగా మారింది. ఏ రోజుకా రోజు ధరల్లో వ్యత్యాసం ఉంటుండగా.. అధిక ధర కోసం ఒక్కోసారి వారంరోజులకు పైగా అక్కడే పడిగాపులు కాయాల్సి వస్తోంది. దీంతో తిండికీ తిప్పలుపడడంతో పాటు రైతులు ఆర్థికంగా మరింతగా నష్టపోతున్నారు.

సాక్షి ఫోకస్

కల్లాల వద్ద దళారుల దోపిడీ..

మార్కెట్‌లో మిర్చి ధర మెరుగ్గా ఉన్నప్పటికీ.. దిగుబడి తగ్గడంతో పెట్టుబడి రాని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో మిర్చి పంట అమ్ముకునేందుకు మార్కెట్ సౌకర్యం లేకపోవడం దళారులకు కలిసి వస్తోంది. గుంటూరు, హైదరాబాద్, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకుని మిర్చి కొనుగోలు చేస్తున్నారు. వీరు కల్లాల వద్దే నేరుగా కొనుగోలు చేస్తున్నప్పటికీ.. హమాలీ ఖర్చులు, రవాణా చార్జీల పేరిట భారీగా కోతలతో పాటు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. క్వింటాల్ మిర్చికి మార్కెట్‌లో రూ.25వేలకు పైగా ధర పలుకుతుండగా.. స్థానికంగా రూ.14 వేల నుంచి రూ.18 వేల వరకు మాత్రమే పెడుతున్నారు.



చెన్నిపాడులో కుప్పగా పోసిన ఎండు మిర్చి

మలక్‌పేటలో విక్రయించా..



నేను ఆరు ఎకరాలలో మిరపపంటను సాగు చేశాను. ఎకరాకు రూ.70 నుంచి 80 వేల వరకు ఖర్చు అయింది. 25 క్వింటాళ్ల మిర్చి దిగుబడి వస్తే మూడు విడతల్లో అమ్మిన. హైదరాబాద్‌లోని మలక్‌పేట మార్కెట్ తీసుకెళ్లి విక్రయించాను. రవాణా ఖర్చులకే మొత్తం రూ.12వేలు అయింది. క్వింటాల్‌కు ధర మొదటిసారి రూ.17,500, రెండోసారి రూ.18వేలు, మూడోసారి రూ.20వేలకు క్వింటాల్ చొప్పున ధర పలికింది. మొత్తంగా పెట్టుబడి కూడా రాలేదు.
– మల్లేశ్, రైతు, గుంతకోడూరు, తాడూరు మండలం

నానా ఇబ్బందులు పడ్డాం..



నేను ఏడు ఎకరాల్లో మిర్చి పంట వేశాను. అధిక వర్షాలతో ఎకరా మేర పూర్తిగా పంట కోల్పోయా. మిగతా 6 ఎకరాల్లో మిర్చి ఏరితే ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున మొత్తం 70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. లెక్కకు 30క్వింటాళ్ల వరకు రావాలి. ఎకరాకు కూలీలు, ఎరువులు, మందులు మొత్తం కలిపి రూ.1.50లక్షల ఖర్చు అయింది. ఆశించినస్థాయిలో రేటు వచ్చినా.. మార్కెట్ సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడ్డాం. మార్కెట్ రేటుతో కొనుగోలు చేసేలా అలంపూర్ చౌరస్తా, గద్వాలలో మార్కెట్ సౌకర్యం కల్పించాలి.
– మద్దిలేటి, చెన్నిపాడు, మానవపాడు, జోగుళాంబ గద్వాల

పెట్టుబడి కూడా రాలేదు..



ఎకరా మిర్చి సాగు చేస్తే రవాణా మినహా రూ.1,30,000 పెట్టుబడి అయింది. మొదటి కాపు నాలుగు క్వింటాళ్లు రాగా.. రాయచూర్ మార్కెట్‌కు తీసుకెళ్లాను. క్వింటాల్‌కు రూ.14వేలతో కొనుగోలు చేశారు. అక్కడ ధర తక్కువగా ఉండడంతో రెండో కాపులో వచ్చిన ఎనిమిది క్వింటాళ్ల మిర్చిని హైదరాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లా. క్వింటాల్‌కు ధర రూ.16వేలు పెట్టారు. మొత్తం 12 క్వింటాళ్లు అమ్మితే రవాణా, ఇతరత్రా ఖర్చులు పోనూ రూ.1.28 లక్షలే వచ్చాయి. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. స్థానికంగా మార్కెట్ సౌకర్యం ఉంటే కొంత కలిసి వచ్చేది.
– జనార్దన్, ఇబ్రహీంపట్నం, మరికల్, నారాయణపేట

మార్కెట్ లేకపోవడం ధరపై ప్రభావం చూపింది..



నేను ఐదు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. తెగుళ్లతో ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్లే వచ్చింది. ధర బాగా ఉండడంతో క్వింటాల్‌కు కనీసం రూ.20 వేలు వస్తుందని అనుకున్నా. కానీ జిల్లాలో ఎక్కడా మార్కెట్ సౌకర్యం లేకపోవడం ధరపై ప్రభావం చూపింది. ఈ నెల మొదటి వారంలో ఓ వ్యాపారికి స్థానికంగా విక్రయిస్తే క్వింటాల్‌కు రూ.12 వేలే పెట్టాడు. పోనీ మంచి ధర వచ్చే వరకు మిర్చిని నిల్వచేసుకుందామంటే ప్రైవేట్‌గా ఉన్న కోల్డ్ స్టోరేజీల్లో అద్దెలు అధికంగా ఉన్నాయి. మేము ఎన్నో ఏళ్లుగా జిల్లాలో మిర్చి మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.
– బీసన్న, అమరవాయి, జోగుళాంబ గద్వాల

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



ఇండోర్ స్టేడియం పనులపై అధికారులతో ఆరా తీస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- 2నెలల్లో ఇండోర్ స్టేడియం అందుబాటులోకి తేవాలి
- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని ముఖ్య కూడళ్లలో సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ జి.రవినాయక్‌తో కలిసి పట్టణంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద పనుల ఆలస్యంపై అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. ఇండోర్ స్టేడియం పనులు రెండు నెలల్లోగా పూర్తి చేయాలని, ఇది జాతీయస్థాయి క్రీడల నిర్వహణకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ హాస్టల్‌ను ఏర్పాటుచేయాలన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీలకు హాజరయ్యే క్రీడాకారులు బస చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్ రామ్‌లక్ష్మణ్, డీవైఎస్ఓ శ్రీనివాస్, పీఆర్ ఈఈ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే మా పోరాటం



మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి

- టీపీసీసీ కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కి కుటుంబపాలన చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టీపీసీసీ కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం రాజాపూర్ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వచ్చే సోమవారం నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్రను తన సొంత గ్రామమైన రంగారెడ్డిగూడ నుంచి మొదలుపెట్టి గడపగడపకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటానని తెలిపారు. రైతుల నుంచి తీసుకున్న దరఖాస్తులను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, కలెక్టర్‌కు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి అందజేస్తామన్నారు. బీఆర్‌ఎస్ చేస్తున్న అక్రమాలను ప్రజలకు వివరిస్తామని, రుణమాఫీ కాని రైతుల వివరాలు తీసుకుంటామని చెప్పారు. పోలేపల్లి సెజ్‌లో పరిశ్రమలు వదులుతున్న కాలుష్యం విషయంపై ఎన్నో సార్లు పత్రికల్లో వరుస కథనాలు వచ్చినా.. స్థానిక ఎమ్మెల్యేకు, సంబంధిత అధికారులకు పట్టదని విమర్శించారు. కాలుష్యం కారణంగా రైతులకు తమ పొలాల్లో పండక ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాలుష్యం అవుతుందంటే పోలీసులే బెదిరిస్తున్నారని, వారు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటేనని ప్రజలను మభ్యపెట్టేందుకే రెండు పార్టీలు నాటకాలు ఆడుతున్నాయన్నారు. సమావేశంలో నాయకులు యాదయ్య, కృష్ణయ్యగౌడ్, శ్రీను, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై దృష్టి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హరితహారం మొక్కల పెంపకంపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. వైకుంఠ ధామాల్లో విద్యుత్, నీటి సౌకర్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు సంబంధించి రానున్న రెండు రోజులు కీలకమని ఖాతాలు తెరిచేందుకు అప్‌లోడ్ చేయడం పూర్తి చేయాలన్నారు. అగ్ని ప్రమాదాలు, వడగాలులు, ఎండలకు బయట తిరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. వచ్చేనెల 3 నుంచి పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఈ నెల 20 నుంచి వచ్చే నెల 6 వరకు నిర్వహిస్తున్న పోషణ పక్షం వాల్‌పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి జరీనాబేగం, డీఆర్‌డీఓ యాదయ్య, డీపీఓ వెంకటేశ్వర్లు, జెడ్పీసీఈఓ జ్యోతి, మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి, డీఈఓ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా పరిష్కరించే వాటిని అక్కడే పరిష్కరించాలని సూచించారు. పింఛన్లు, ధరణి సమస్యల పరిష్కారంలో భాగంగా పాత కేసులపై తహసీల్దార్లు దృష్టిసారించాలన్నారు. సుమారు 430 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశారు. కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ, డీఆర్‌డీఓ యాదయ్య, జెడ్పీసీఈఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ రవినాయక్ తదితరులు

దివ్యాంగులకు అండగా ఉంటాం

దేవరకద్ర: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటూ వారి సంక్షేమం కోసం పాటుపడుతుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం దేవరకద్ర మార్కెట్ యార్డులో 200 మంది దివ్యాంగులకు ఉచిత బస్ పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఆర్టీసీ వారు రాయితీ బస్‌పాస్‌లను అందజేస్తుండగా దీనికి గాను పాస్ జారీ రుసుం కింద చెల్లించాల్సిన రూ.50 ప్రకారం 200 మంది దివ్యాంగులకు మార్కెట్ కమిటీ రూ.10 వేలు చెల్లించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రూ.3,016 ఫించన్‌గా ఇస్తూ అండగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మవద్దని వారు చేసేది తక్కువ చెప్పుకునేది ఎక్కువ అని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



బస్‌పాస్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం



సమస్యలను పరిశీలిస్తున్న అధికారి

పాలమూరు: ప్రావిడెంట్ ఫండ్ సభ్యులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తున్నామని, దీనికోసం ప్రతినెలా 27న పీఎఫ్ సభ్యులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామని పీఎఫ్ జిల్లా నోడల్ ఆఫీసర్ రమేష్‌బాబా తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలోని ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ప్రతినెలా 27న పీఎఫ్ సభ్యులు, ఉద్యోగులు, పెన్షనర్లకు ఉన్న సమస్యలపై సదస్సులు ఏర్పాటు చేయడంతోపాటు వాటిని పరిష్కరించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నిధి ఆప్ కే నిక్కడ్-2.0 కార్యక్రమంలో పీఎఫ్‌కు సంబంధించిన వ్యక్తిగత తప్పులను సరి చేస్తామన్నారు. ఐపీఎస్ పెన్షనర్లు మాత్రం తమ పెన్షన్‌కు సంబంధించిన ఆప్షన్లను పీఎఫ్ కమిషనర్ విడుదల చేసిన జీఓ ఆధారంగా ఆన్‌లైన్ ద్వారా పంపించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ విశ్రాంత ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం


శశికళ (ఫైల్)

అయిజ: ఆంధ్రప్రదేశ్ ఓర్వకల్లులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన వివాహిత మృతిచెందింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గోపాలయ్యశెట్టి, అతడి భార్య శశికళ (42) సోమవారం బేతంచెర్లలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శశికళ అక్కడికక్కడే మృతిచెందగా.. గోపాలయ్యశెట్టికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించారు.

బస్సు ఢీకొని యువకుడు..



వనపర్తి క్రైం: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం వనపర్తి మండలం నాగవరంతండా సమీపంలో చోటుచేసుకుంది. వనపర్తి జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన పరమేష్(24) హైదరాబాద్‌లో మేస్త్రీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. అయితే తమ్ముడు బాలపీరు మృతిచెండంతో అంత్యక్రియల నిమిత్తం పరమేష్ వనపర్తికి వచ్చాడు. అంత్యక్రియలు పూర్తయిన తర్వాత తిరిగి సోమవారం బైక్‌పై హైదరాబాద్ వెళ్తుండగా, వనపర్తి మండలం నాగవరంతండా వద్ద కొత్తకోట నుంచి వనపర్తికి వస్తున్న బస్సును ఢీకొన్నాడు. అక్కడికక్కడే మృతిచెందాడు.

రోడ్డు దాటుతూ మహిళ..

నారాయణపేట రూరల్: రోడ్డు దాటుతున్న మహిళను వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. నారాయణపేటలోని సుభాష్ రోడ్డుకు చెందిన ఎక్బోటే నాగేశ్వరి(53) సోమవారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి లయన్స్‌క్లబ్ వైపు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్ మీద వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు ద్విచక్రవాహనదారుడిని పట్టుకునేలోగా పరారయ్యాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై నాగేశ్వరి అల్లుడు ఎడికే అమర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. నాగేశ్వరి మృతి పట్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, బీజేపీ నాయకులు నాగురావునామాజీ, రఘు సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బావిలో పడి వ్యక్తి మృతి

నారాయణపేట రూరల్: బావిలో పడి అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సుభాష్‌రోడ్‌కు చెందిన సంక్లాపురం ప్రదీప్ (37) సోమవారం ఉదయం బారం బావి దగ్గరకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. సాయంత్రం నీళ్లపై మృతదేహం తేలుతూ ఉండటాన్ని అటుగా వెళ్తున్న వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి విచారించగా ప్రదీప్‌గా గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై మృతుడి తమ్ముడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మరొకరు..

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎన్మన్‌బెట్లలో పుట్ట స్వామి (45) ఆదివారం రాత్రి ఇంట్లో అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ బాలవెంకటరమణ తెలిపారు. అక్క బొక్కలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపినట్లు వివరించారు.

ఆలయంలో హుండీ అపహరణ

మిడ్జిల్: మండల కేంద్రంలోని వాడిక వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద హుండీని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఆలయ పూజారి యుగంధర్‌శర్మ సోమవారం మిడ్జిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం మొదటి వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. రాత్రి భజన ముగిసిన అనంతరం తెల్లవారుజామున లేచి చూసేసరికి హుండీ కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చిరుధాన్యాల రొట్టెలు

- కొనుగోలుదారుల ఆసక్తి
- దాబాలు, దుకాణాల్లో పెరిగిన విక్రయాలు
- ఉపాధి పొందుతున్న మహిళలు


రొట్టెలు తయారు చేస్తున్న మహిళలు

గండేడ్: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చిన్న చిన్న యూనిట్లు మంజూరు చేస్తూ వారిని ప్రోత్సహిస్తోంది. మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం రూర్బన్ పథకం కింద రూ.24.50 లక్షలతో మిల్లెట్ యూనిట్ ప్రారంభించారు. ఇందులో 9 రకాల యంత్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా చిరుధాన్యాలతో వివిధ రకాల తినుబండారాలు తయారుచేసి విక్రయించడం ద్వారా మహిళలకు ఉపాధి కల్పించాలన్నది ఉద్దేశం. మండలంలోని పలు గ్రామాల మహిళలతో కలిపి మహిళా ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేశారు. యూనిట్ నిర్వహణకుగాను ఒక్కో సంఘం నుంచి రూ.500 చొప్పున 403 సంఘాలతో మూలధనం సేకరించి కేంద్ర ప్రభుత్వ వాటాగా పంపించారు. జమైన మూలధనానికి సమానంగా కేంద్రం నుంచి రూ.3.50 లక్షలు మంజూరయ్యాయి. వీటితో పాటు మహిళా సమాఖ్య నుంచి కొంత డబ్బు తీసుకొని యూనిట్ నిర్వహణకు వినియోగించారు. ఇందులో రొట్టెల తయారీ యూనిట్ రోజురోజుకు ఊపందుకుంది. మొదటి ఏడాది అంతంత మాత్రంగానే నడిచినా.. రానురాను జోరందుకుంది.

రోజుకు సుమారు రెండు వేలు..

మండల కేంద్రంలోని సమాఖ్య భవనంలో కొనసాగుతున్న రొట్టెల తయారీ యూనిట్‌లో ఒకప్పుడు 100 నుంచి 500 వరకు తయారు చేసేవారు. రాను


ప్యాకింగ్ ఇలా..

రాను వీటికి ఆదరణ పెరగడంతో నేడు ఆ సంఖ్య 1,500 నుంచి రెండు వేలకు చేరింది. రూ.5 ఒకటి చొప్పున విక్రయిస్తున్నారు. వీనిని సల్కర్‌పేట్, వెన్నాచేడ్, అంచన్‌పల్లి, గండేడ్ తదితర గ్రామాల్లోని హోటళ్లు, దాబాలు, కిరాణ దుకాణాలకు విక్రయించడంతో పాటు మహమ్మదాబాద్, కోస్గి, హన్వాడ మండలాలకు కేంద్రం నుంచి నేరుగా సరఫరా చేస్తున్నారు. డిమాండ్ పెరగడంతో ఎక్కువ మొత్తంలో తయారు చేసేందుకు ఇటీవల పెద్దపెంక, పొయ్యిని కొనుగోలు చేశారు. మొదట ఒకేసారి 4 రొట్టెలు అవుతుండగా.. ప్రస్తుతం 8 తయారవుతున్నాయి. పిండి కలిపి మిషన్‌లో వేసి రొట్టెలు కట్ చేసి అనంతరం పెనంపై కాల్చి ఆరబెట్టి ప్యాకింగ్ చేస్తున్నారు.

రూ.250 చొప్పున..

యూనిట్‌లో ప్రస్తుతం ఆరుగురు మహిళలు పనిచేస్తుండగా.. ఒక్కొక్కరికి రోజుకు రూ.250 చెల్లిస్తున్నారు. దీనిని విస్తరిస్తే మరింత మందికి ఉపాధితో పాటు యూనిట్‌కు ఆదాయం కూడా పెరగనుంది.

జొన్నలు సరఫరా చేయాలి..



రొట్టెలకు రోజురోజు డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుత మార్కెట్‌లో జొన్నలు క్వింటా రూ.అయిదు వేలకుపైగా ఉన్నాయి. స్థానికంగా అందుబాటులో లేక నారాయణపేట, మక్తల్, కర్ణాటక నుంచి తీసుకురావాల్సి వస్తోంది. రవాణా ఖర్చులతో అదనపు భారం పడుతోంది. ప్రస్తుతం తయారీ నిలువకుండా ఏదోరకంగా నెట్టుకొస్తున్నాం. ప్రభుత్వమే కొనుగోలు సరఫరా చేస్తే బాగుంటుంది. – వన్నలి రాఘవేంద్రమ్మ, యూనిట్ అధ్యక్షురాలు

మార్కెటింగ్ పెరగాలి..

రొట్టెలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉండటంతో ఉపాధి పొందుతున్నాం. మూత పడకుండా కొనసాగించాలి. మార్కెటింగ్ మరింత పెరిగేలా అధికారులు సహకారం అందించాలి. కూలీ పెంచితే మా కుటుంబాలకు చేయూత నిచ్చినట్లవుతుంది. – నసీమ, తయారీదారు, గండేడ్

కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు రసీదు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి

పాలమూరు: వినియోగదారులకు అనేక చట్టాలు అందుబాటులో ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవడంతోపాటు ఉపయోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. జిల్లాకేంద్రం పారిశ్రామికవాడలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో సోమవారం చట్టాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వస్తువుల కొనుగోలు విషయంలో మోసం జరిగితే వినియోగదారునికి చట్టం అండగా ఉంటుందని, ఏదైనా వస్తువును డబ్బు పెట్టి కొనుగోలు చేసిన సమయంలో నాణ్యత లేకపోవడం, ఇతర ఏదైనా సమస్య ఉండటంతోపాటు నష్టం కలిగితే చట్టాన్ని ఆశ్రయించవచ్చన్నారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు తప్పక రసీదు తీసుకోవాలని, రసీదు ఉంటేనే రాతపూర్వకంగా ఫిర్యాదుతో కేసు నమోదు అవుతుందన్నారు. దీంతో దానికి అనుగుణంగా పరిహారం డిమాండ్ చేయవచ్చని చెప్పారు. 2007 చట్టం ద్వారా పిల్లలు, వయోవృద్ధులను వేధించినా, పోషణ భారాన్ని తిరస్కరించిన తీవ్రంగా పరిగణించి.. జైలుశిక్షతోపాటు పిల్లలకు బదులాయించిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, నారాయణరావు, నాగభూషణం, రాజసింహుడు, న్యాయవాది రవికుమార్, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

నేరాలు అదుపు చేసేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్


మాట్లాడుతున్న ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: నేరాలను కట్టడి చేయడానికి పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం చేపడుతున్నామని ఎస్పీ కె.నరసింహ అన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంమందిర్ కూడలి, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామచంద్రాపూర్‌లో సోమవారం రాత్రి పోలీస్ కమ్యూనిటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి తనిఖీ నిర్వహించి ఆయా ఇళ్లలో నివాసం ఉండే వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఇలాంటి కార్యక్రమం ద్వారా ఎవరైనా కొత్త వ్యక్తులు ఆశ్రయం తీసుకుంటున్నారా? అనే విషయాలు తెలుస్తాయని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి వాహనదారుడు తప్పక హెల్మెట్ పెట్టుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. వాహనాలకు సంబంధించి ధ్రువపత్రాలు, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ కలిగి ఉండాలన్నారు. జిల్లాలో మహిళ భద్రతే పోలీస్ లక్ష్యమని, మహిళలు, అమ్మాయిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి కాలనీ, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ టి.మహేష్, సీఐలు స్వామిగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పునరావాసాలకు పైసా ఖర్చు చేయలేదు

- శిలాఫలకాలపై పేరు పెట్టుకునే అర్హత ఎమ్మెల్యేకు లేదు
- నా హయంలోనే 90 శాతం పనులు
- జీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ


ఉప్పేరులో మాట్లాడుతున్న డీకే అరుణ

ధరూరు: బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు అయినా నేటికీ మండలంలోని ఏ ఒక్క పునరావాస కేంద్రానికి పైసా కూడా కేటాయించలేదని, 90శాతం పనులు తాను మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే చేశానని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పేరు పునరావాస కేంద్రంలో శివాంజనేయ స్వామి ఆలయం, గణపతి, శివలింగం, బొడ్రాయి, నాగదేవత, ధ్వజస్తంభం ప్రతిష్ఠ ఉత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పూజల అనంతరం ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని పునరావాస కేంద్రాలను ఒక్కో గుడికి రూ.25లక్షలు మంజూరు చేయించి పనులు చేయించానన్నారు. పైసా ఖర్చు చేయని స్థానిక ఎమ్మెల్యే ఈ తొమ్మిదేళ్లలో పునరావాప కేంద్రాలకు ఏం చేశారో చెప్పాలన్నారు. ప్రతిష్ఠ కార్యక్రమానికి ముందే గ్రామానికి వచ్చి శిలాఫలాలపై తన పేరు పెట్టుకునే అర్హత స్థానిక ఎమ్మెల్యేకు లేదన్నారు. ఇక్కడ చేసిన అభివృద్ధి అంతా తాను చేసిందేనని విమర్శించారు. ఓట్లు సమీపిస్తున్నందున ప్రజల ముందు ముఖం చెల్లదని చెప్పి గట్టు ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించారని ఆరోపించారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభమై ఇన్నేళ్లయినా ర్యాలంపాడు, చిన్నోనిపల్లి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ఉప్పేరులో త్వరలోనే వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.

నీటి నిలిపివేత

మదనాపురం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ, సమాంతర కాల్వకు నీటిని నిలిపివేయడంతో రామన్‌పాడు జలాశయానికి ఎలాంటి ఇన్‌ఫ్లో లేదు. సోమవారం సాయంత్రం నీటిమట్టం 1,018 మేర ఉంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 69 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

తాను చనిపోతూ.. మరికొందరికి జీవితం


శేషగిరికి ప్రశంసాపత్రం అందజేస్తున్న వైద్యులు


వీణ (ఫైల్)

నారాయణపేట: తాను చనిపోతూ.. మరికొందరికి జీవితాన్నిచ్చింది ఓ ఇల్లాలు. వివరాలిలా.. నారాయణపేట జిల్లా కృష్ణ మండలకేంద్రానికి చెందిన శేషగిరి ఆచార్ భార్య వీణ కలిసి నాలుగు రోజుల క్రితం ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో ఓ బాలుడు టీవీఎస్‌ను అజాగ్రత్తగా నడుపుతూ రావడంతో శేషగిరి తన బైక్‌ను సడన్‌బ్రేక్ వేశారు. దీంతో వెనక ఉన్న భార్య వీణ తారు రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే రాయిచూర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి తరలించగా ఆదివారం రాత్రి మృతిచెందింది. దీంతో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు వీణ భర్తను అవయవాలు దానం చేయాలని కోరగా.. ఆయన అంగీకరించడంతో కిడ్నీలు, గుండె, కళ్లు, గుండె లంగ్స్ సేకరించారు. ఈ మేరకు శేషగిరిని అభినందిస్తూ ఆస్పత్రి ప్రశంసపత్రాన్ని అందజేశారు. సోమవారం వీణకు స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

చేసిన పనులే గుర్తింపునిస్తాయి


సత్కారం అందుకున్న పాలకమండలి చైర్మన్, సభ్యులు

జోగుళాంబ శక్తిపీఠం: పదవీకాలంలో చేసిన పనులే శాశ్వత కీర్తి, గుర్తింపును ఇస్తాయని అలంపూర్ జోగుళాంబ ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ అన్నారు. పాలకమండలి పదవీకాలం ముగియడంతో సోమవారం దేవస్థానం పాలకమండలికి ఆలయం తరపున అభినందన సభ, ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఈఓ మాట్లాడుతూ ఏడాది పదవీకాలంలో పాలకమండలి దేవస్థానం వారికి పరిపాలన రంగంలో ఎంతగానో సహకరించారని కొనియాడారు. అమ్మవారి అనుగ్రహంతో వారికి మరోమారు పదవీయోగం కలగాని, కొత్త సంవత్సరంలో వారికి మంచి జరగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అర్చకులు, సిబ్బంది మాట్లాడుతూ పాలకమండలి అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేశారన్నారు. చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తాను అమ్మవారికి సేవ చేయాలని తొలిరోజు చేసిన సంకల్పంలో, తన దీక్షలో ఎలాంటి లోపం లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. అయితే పదవీకాలం చాలా తక్కువ ఉందని మరోమారు అవకాశం వస్తే అనుకున్న కార్యక్రమాలన్నీ పూర్తి చేస్తామన్నారు. అనంతరం పాలకమండలి చైర్మన్‌తోపాటు సభ్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

మద్యం దుకాణంలో రూ.4 లక్షల చోరీ

హన్వాడ: మండల కేంద్రంలోని మద్యం దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... మండల కేంద్రంలోని రాజ రాజేశ్వరీ వైన్స్‌ను నిర్వాహకులు ఆదివారం రాత్రి మూసి, ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం ఉద యం వచ్చి దుకాణం తెరవగా పైకప్పు రేకులు ధ్వంసమై కనిపించాయి. కౌంటర్ తీసి చూడగా రూ. 4.10లక్షల నగదు, మూడు వేల విలువైన మద్యం చోరీ చేసినట్లు గుర్తించారు. దీంతో నిర్వాహకుడు పవన్‌రెడ్డి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు డీఎస్పీ మహేష్, సీఐ రాజేశ్వర్‌గౌడ్, ఫింగర్ ప్రింట్ ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్, సీసీఎస్ డీఎస్పీ, సీఐ, సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలన చేశారు. పవన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రవి నాయక్ తెలిపారు.

సలేశ్వరం ఉత్సవాలకు అనుమతివ్వండి


డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లింగస్వామి, చెంచు నాయకులు

మన్ననూర్: సలేశ్వరం ఉత్సవాలు వచ్చే నెల 3 నుంచి 11 వరకు పూర్తిగా చెంచుల సమక్షంలో నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నిమ్మల లింగస్వామి సోమవారం డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డికి స్థానిక ఈసీ సెంటర్‌లో వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన డీఎఫ్ఓ పలు సూచనలు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతి ఇస్తామని.. అటవీ నిబంధనల ప్రకారం ప్లాస్టిక్, జంతువులకు హాని చేసే వస్తువులతో భక్తులు అడవుల్లో సంచరించకుండా సిబ్బందికి ఉత్సవ కమిటీ సహకరించాలని సూచించారు. బీడీ, సిగరేట్ వంటి నిప్పుకు సంబంధించినవి కూడా ఉపయోగించరాదని వివరించారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి..

రాంపూర్ చెంచుపెంట చెంచులతో కలిసి ఆదివాసి చెంచు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లింగస్వామి విలేకర్లతో మాట్లాడారు. చెంచుల సంస్కృతీ సంప్రదాయలు ఉట్టిపడేలా ఉత్సవాలు వారం పాటు కొనసాగుతాయన్నారు. టోల్‌గేట్ మినహా కొబ్బరి కాయలు, తలనీలాలు, లడ్డూ తదితర వాటి విక్రయాలు చెంచులకే పరిమితం చేసి టెండర్లు వేస్తామని తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉత్సవాలు జరిగేందుకు సహకరించాలని కోరారు. ఉమ్మడి జిల్లాతో పాటు నల్లగొండ, హైదరాబాద్, రంగారెడ్డి తదితర జిల్లాలు, ఏపీ భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో చెంచు నాయకులు చిర్ర రాములు, చిన్నగురువయ్య, బాలగురువయ్య, బల్మూరు లింగయ్య, లక్ష్మి, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలి'

పాలమూరు: కొంత కాలంగా బోధన వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం ఇప్పటికి పరిష్కరించలేదని ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది నిరసన నిర్వహించిన క్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన హామీ మేరకు సమ్మెను వాయిదా వేసుకున్నామని, కానీ ఇప్పటి వరకు డిమాండ్లు పరిష్కారం కాలేదన్నారు. పాలమూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్యుల పోస్టులు పెంచాలని, అన్ని విభాగాల్లో పీజీ సీట్లు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యులకు రావాల్సిన 54 నెలల పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. స్థానికంగా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతికి సిద్ధంగా ఉండి ఇక్కడే పని చేయడానికి ఆసక్తి ఉన్న వారికి ఇక్కడే పోస్టింగ్స్ ఇవ్వాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి డాక్టర్ సిరాజుద్దీన్, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ రాధ, డాక్టర్ జీవన్, బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మామిడి చెట్లకు పెళ్లి'

బంధువులకు దుస్తులు, సారె, వన భోజనాలు


మామిడిచెట్లకు పెళ్లిల్లు చేస్తున్న గిరిజన రైతులు

నాగర్‌కర్నూల్ రూరల్: నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామపంచాయతీ పరిధిలో రాంరెడ్డిపల్లి తాండాలో అక్కడి గిరిజనులు వారు పెంచిన మామిడి చెట్లకు సోమవారం గిరిజన రైతులు పెళ్లి నిర్వహించారు. వేద పండితులతో మంత్రోచ్చరణల మధ్య బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో 5 సంవత్సరాలుగా పెంచి పోషించిన మామిడి చెట్లు పెద్దవై కాపురావడంతో వారి పూర్వీకుల సూచనల మేరకు మామిడి చెట్లకు పెళ్లి చేసినట్లు చెప్పారు. అనంతరం వారి బంధుమిత్రులకు ఆడపడుచులకు సారె, చీరలు పెట్టి వనభోజనాలు ఏర్పాటు చేశారు. మామిడి చెట్ల ముందు పందిళ్లు వేసి పెళ్లికుమారుడు, పెళ్ళి కుమార్తెకు వేషధారణ చేసి వేద పండితులు మంత్రాలు వల్లించగా తాళి కట్టి తలంబ్రాలు పోశారు. ఇప్పటి వరకు వారు పెంచిన 10 ఎకరాల మామిడి తోటలో ఒక్క మామిడి తోటలో ఒక్కమామిడి కాయను కూడా కోసుకుని తినలేదని, తాము పెంచిన 500 మొక్కల్లో ఏ మొక్కకు కాసిన పండును కూడా తాము ముట్టలేదని తమ పూర్వీకులు సూచించిన సూచన మేరకు పెళ్లి నిర్వహించి అప్పుడే ఆ చెట్లకు కాసిన కాయలను తన కుటుంబ అవసరాలకు వాడుకోవాలని నిర్ణయించుకునే ఈ పెళ్లిళ్లు చేశామని అన్నారు. తండాకు చెందిన తోట యజమానులు బిలాలునాయక్, దాసు, రాందాసు, వాలునాయక్, తిరుపతయ్య అన్నదమ్ములు కాగా వారంతా పెళ్లిలో పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు సోమవారం శ్రీమాన్ సుదర్శన్ నారాయణ్ ఆధ్వర్యంలో శిష్యబృందం కోయిలాళ్వార్ తిరుమంజనం, అంకురార్పణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట సీఐ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటా..

వీడియోను పోస్టు చేసిన మనిగిల్ల యువకుడు

వనపర్తి: కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్‌చేయకపోతే.. తన చావుకు అతనే కారణమని సీఐ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటానని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామానికి చెందిన శివకుమార్‌యాదవ్ అనే యువకుడు సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. గత నెలలో స్థానిక మంత్రి గురించి ఓ వీడియో పోస్టు చేశానని అక్రమంగా అరెస్ట్ చేసి వనపర్తి పోలీస్‌స్టేషన్‌లో కొత్తకోట సీఐ శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా కొట్టారని వాపోయాడు. ఫిర్యాదు చేసి నెలరోజులు గడుస్తున్నా సీఐపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని తెలిపారు. 'నన్ను తీవ్రంగా కొట్టిన సీఐపై చర్యలు తీసుకోకపోవడం మనస్తాపానికి గురి చేస్తోంది. న్యాయం చేసే వరకు పోరాటం చేస్తాను. ఆయన పేరు రాసి సూసైడ్‌చేసుకుంటా. నా చావుకు సీఐ కారణం అవుతాడు.' అని సోషల్‌మీడియాలో శివకుమార్ ఓ వీడియోను పోస్టు చేశాడు.

క్లుప్తంగా...

ఎప్పటిలోగా చెల్లిస్తారు?

ఆర్టీసీని నివేదిక కోరిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగుల సహకార పరపతి సంఘానికి (సీసీఎస్) బకాయిపడ్డ మొత్తంలో ఇప్పటివరకు ఎంత చెల్లించారు.. మిగతాది ఎప్పటిలోగా చెల్లిస్తారో వచ్చే సోమవారంలోగా నివేదికను అందజేయాలని ఆర్టీసీని హైకోర్టు ఆదేశించింది. సీసీఎస్‌కు జమ చేయాల్సిన నిధులను సంస్థ సొంతానికి వాడేసుకోవడంతో వడ్డీ సహా రూ.900 కోట్ల బకాయిలు ఏర్పడ్డాయి. ఫలితంగా ఉద్యోగులకు ఈ సంఘం ద్వారా మంజూరు చేయాల్సిన రుణాలు ఆగిపోయాయి. దీంతో బకాయిల్లో కొంతమొత్తం చెల్లించాలని ఎప్పట్నుంచో ఆ సంఘం కోరుతున్నా ఆర్టీసీ నుంచి స్పందన లేకపోవడంతో సీసీఎస్ ఇటీవలే హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

సాయుధ పోరాటం తెలియని మూర్ఖులు బీజేపీ నాయకులు


నారాయణ

సాక్షి, మహబూబాబాద్: తెలంగాణ సాయుధ పోరాటం గురించి తెలియని మూర్ఖులు బీజేపీ నేతలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అమరుల స్థూపాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం 59జీఓ ద్వారా అత్యధిక డబ్బులు చెల్లించాల్సి వస్తున్న పేదల గుడిసెలను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే సాయుధ పోరాట యోధుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని బీజేపీ చెప్పడం హాస్యాస్పదమన్నారు.

ప్రెజర్‌బాంబు పేలి జవాన్ మృతి


విజయ్ యాదవ్ (ఫైల్)

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలి యూపీకి చెందిన జవాన్ మృతి చెందాడు. బీజాపూర్ జిల్లా బైరంగఢ్ పీఎస్ పరిధిలోని తిమ్నార్ సీఏఎఫ్ క్యాంపుజవాన్లు అడవిలో సోమవారం కూంబింగ్ చేపడుతుండగా కాస్త దూరంలో మావోయిస్టులు ప్రెజర్ బాంబు అమర్చారు. దీన్ని గమనించకుండా సీఏఎఫ్ అసిస్టెంట్ ప్లాటూన్ కమాండర్ విజయ్ యాదవ్ కాలు వేయడంతో బాంబు పేలింది. ఆయన్ను క్యాంపునకు తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందాడు.


మహాభారత యుద్ధం చిత్రాలు


గ్రేటర్ వరంగల్ నగరంలోని మోడల్ హిందూ వైకుంఠధామం వ్యూ

అల..వైకుంఠధామంలో..

పచ్చని గ్రీనరీ.. ఆహ్లాద వాతావరణం • భగవద్గీతలాంటి ఆధ్యాత్మిక గ్రంథాలతో లైబ్రరీ

- విశాలమైన 4.20 ఎకరాల స్థలం
- చుట్టూ సీసీ కెమెరాలు, ప్రహరీకి సోలార్ ఫెన్సింగ్
- స్మార్ట్ సిటీలో మోడల్‌వైకుంఠధామం
- మహిళా సంఘాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించే అవకాశం


భారీ శివుడి విగ్రహం


వైకుంఠధామంలో లోపల పచ్చని చెట్లు

వరంగల్ డెస్క్: పచ్చటి గ్రీనరీ.. ఐటీ హబ్‌ను తలపించే ముఖద్వారం.. లోపలికి అడుగుపెట్టగానే స్వాగతం పలికే.. వివిధ రకాల కడియం పూల అందాలు.. ఆధ్యాత్మికతను తలపించే శివుడి భారీ విగ్రహం.. కొంచెం లోపలికి వెళ్తే.. సేద దీరేందుకు చెట్లకింద రచ్చబండలు.. విశాలమైన పార్కింగ్ సదుపాయం.. గ్రీనరీ నడుమ అక్కడక్కడ నిర్మాణాలు.. ఇదేదో ఆలయమో.. లేదా సేద దీరే పార్క్ అనుకుంటున్నారా.. కాదండోయ్ స్మార్ట్ సిటీ అయిన వరంగల్ నగరంలోని మోడల్ వైకుంఠధామం. మనిషి చనిపోయాడన్న దుఃఖంతో వచ్చిన వారికి ఆ బాధనుంచి కాస్త ఉపశమనం కలిగేలా అన్ని హంగులు, ఆధునిక సొబగులతో తీర్చిదిద్దారు. నగరంలోనే ఇది మొదటి మోడల్ హిందూ వైకుంఠధామం.

మోడల్ డివిజన్‌లో.. మోడల్ వైకుంఠధామం

వరంగల్ నగరంలోని 57వ డివిజన్‌ను మోడల్ డివిజన్‌గాఎంపిక చేశారు. ఈ డివిజన్ పరిధిలోని వాజ్‌పేయి కాలనీలో పాత శ్మశాన వాటికను మోడల్ వైకుంఠధామంగా ఎంపిక చేశారు. సీఎంఏ నిధులు రూ.4.50 కోట్లతో 2.20 ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దారు. ముఖద్వారం నుంచి నేరుగా లోపలికి వెళ్లేలా దారులు.. ఆ దారుల చుట్టూ కడియం పూల మొక్కలు.. పచ్చటి గ్రీనరీని పెంచారు. బర్నింగ్ ఫ్లాట్‌ఫామ్‌లకు వెళ్లే దారిలో సత్యహరిశ్చంద్రుడి జీవిత చరిత్రను చిత్రాలతో పొందుపరిచారు. మరోవైపు మహాభారత యుద్ధ సన్నివేశాన్ని కూడా చిత్రాలతో పొందుపర్చారు. ఇక మనిషికి అవసరమైన నీరు, భూమి, గాలి, అగ్ని, నిర్మలమైన ఆకాశం.. పంచభూతాలను ఒకే దగ్గర కల్పించడం అన్న కాన్సెప్ట్‌తో ఈ వైకుంఠధామాన్ని నిర్మించారు.

పురాతన గ్రంథాలతో లైబ్రరీ

ఈ వైకుంఠధామంలో లైబ్రరీని ఏర్పాటు చేశారు. అందులో భగవద్గీత, మహాభారతంలాంటి గ్రంథాలను అందుబాటులో ఉంచనున్నారు.

నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు కమిటీ ఏర్పాటు

మోడల్ వైకుంఠధామం నిర్వహణ బాధ్యతలను అప్పగించేందుకు కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం మృతదేహాల దహనం బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించారు. మృతదేహాన్ని తీసుకురావడం నుంచి వైకుంఠరథం, పూలు, కర్రలు, దహనం వరకు అన్ని కార్యక్రమాలను వారి నిర్వహణలో చేయాలని భావిస్తున్నారు. ఇక మిగతా గ్రీనరీ బాధ్యతలను ఉద్యానవనశాఖ, ఎలక్ట్రికల్‌ను ఎలక్ట్రికల్ విభాగం, సివిల్ పనులు.. సివిల్ విభాగానికి కేటాయించనున్నారు. ఒక డెడ్‌బాడీ దహనానికి ఎంత చార్జ్ చేస్తారనేది ఇంకా నిర్ణయించాల్సి ఉంది. దీనిని త్వరలో రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మోదీ విధానాలు ప్రమాదకరం


కూనం నేని

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: దేశంలో ప్రస్తుతం చీకటి యుగం నడుస్తోందని.. స్వాతంత్య్రం కంటే ముందు, ఆ తర్వాత కూడా ఇలాంటి పరిస్థితులు లేవని, బీజేపీ విధానాల కారణంగానే ఇలాంటి దుర్భర పరిస్థితులు దాపురించాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రతిపక్షాల గొంతు నొక్కడానికే ప్రధాని ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వ విధానాలను తప్పుబట్టే నేతలపై నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మోదీ విధానాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ప్రతిపక్షం చెప్పింది వినకూడదనే ధోరణితో బీజేపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందన్నారు.

బీజేపీని అధికారంలోకి రానివ్వబోం


తమ్మినేని

నల్లగొండ: తెలంగాణలో బీజేపీని అధికారంలోకి రానివ్వబోమని, బీజేపీని అడ్డుకునేందుకు లౌకిక, ప్రజాస్వామిక శక్తులను కలుపుకుపోతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్యయాత్ర సోమవారం నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, నకిరేకల్, చిట్యాలలో సాగింది. ఈ సందర్భంగా ఆయా చోట్ల తమ్మినేని మాట్లాడుతూ మునుగోడు శాసనసభ ఉపఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలతో బీఆర్‌ఎస్ పార్టీ కలిసి పనిచేసి విజయం సాధించిన తర్వాత సీఎం కేసీఆర్ ఇప్పటికే పలు బహిరంగసభల్లో కమ్యూనిస్టులతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారని చెప్పారు. రాజ్యాంగ విరుద్ధంగా రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని కేంద్రం రద్దుచేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేంద్రం రాజ్యాంగ పద్ధతులను మార్చి పాలన సాగిస్తోందన్నారు.

సంగారెడ్డిలో యూనివర్సిటీ ఏర్పాటు చేయండి

సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే జగ్గారెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖరాశారు. 'సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న 8 నియోజకవర్గాల నుంచి విద్యార్థులు వస్తారు. మెదక్‌తో పాటు తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలకు చెందిన వారు కూడా వస్తారు. సంగారెడ్డిలోని తారా డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం ఆ విద్యార్థులు పీజీ వరకు చదువుకుంటున్నారు. ఆ తర్వాతి చదువులకు మాత్రం హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో కొందరు విద్యార్థులు పీహెచ్‌డీ, ఇతర కోర్సులు చేయలేక మానేస్తున్నారు. తారా డిగ్రీ కళాశాలలో 40 నుంచి 50 ఎకరాల వరకు స్థలం కూడా ఉంది. ఆ స్థలం యూనివర్సిటీకి సరిపోతుంది. సంగారెడ్డిలో యూనివర్సిటీ డిమాండ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి కూడా బాగా వినిపిస్తోంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని వీలున్నంత త్వరలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతున్నా'అని సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖలో జగ్గారెడ్డి కోరారు.

లక్ష రుణ మాఫీ ఏదీ..

భువనగిరిలో మంత్రిని నిలదీసిన రైతు


రైతు రుణమాఫీ ఎప్పుడు అమలు చేస్తారని మంత్రి జగదీశ్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న రైతు హరినాథ్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: సీఎం కేసీఆర్ లక్ష రుణమాఫీ ప్రకటించారు..ఇంకా అమలు కాలేదు..ఎప్పుడు చేస్తారని యాదాద్రి భువనగిరి జిల్లా హుస్నాబాద్‌కు చెందిన రైతు భీరెడ్డి హరినాథ్‌రెడ్డి విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని ప్రశ్నించారు. సోమవారం భువనగిరిలో రైతు సేవా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మహాజన సభలో ప్రసంగించి వేదిక నుంచి దిగుతుండగా రైతు మంత్రి దగ్గరకు వెళ్లి ప్రశ్నించారు. మొన్ననే రూ.లక్ష రుణమాఫీ చేశామని మంత్రి సమాధానమిస్తూ ముందుకు సాగారు. అయితే..రుణమాఫీ విషయాన్ని మైకులో చెప్పాలని రైతు కోరగా..మంత్రి నుంచి స్పందన రాలేదు. దీంతో రైతు హరినాథ్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ..సమస్యలు అడిగితే మంత్రి విసుక్కుంటున్నారని, ప్రశ్నిస్తే ప్రతిపక్షం అంటున్నారని మండిపడ్డాడు.

అక్కడ ఆ పథకాలు అమలైతే | రాజకీయ సన్యాసం

సవాల్ విసిరిన స్పీకర్ పోచారం

- తెలంగాణ తరహా సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నాయా అని ప్రశ్న?


మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నట్లు చూపిస్తే తాను రాజకీయ సన్యాసం చేస్తానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సవాలు విసిరారు. సోమవారం రాత్రి కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. తాను స్పీకర్ హోదాలో రాలేదని, ఒక ఎమ్మెల్యేగా సమ్మేళనానికి వచ్చానన్నారు. దేశంలోని బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చూపిస్తే వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయనన్నారు. ఇటీవల బాన్సువాడకు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తనపై, తన కుటుంబ సభ్యులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చాలా బాధించాయన్నారు. 'హైదరాబాద్‌లో భూ కబ్జాలకు పాల్పడే వ్యక్తి, ఓ బడా చోర్, నీ వెంట బాన్సువాడలో ఉన్న చోటా దొంగలు కలిసి ఆరోపణలు చేయడం సిగ్గు చేటని'ధ్వజమెత్తారు. తనపై, తన కుమారులైన పోచారం సురేందర్‌రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డిలపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, వెంట పడి తరుముతామని హెచ్చరించారు. స్వచ్ఛమైన జీవితం నుంచి వచ్చానని, అవసరమైతే బిచ్చమెత్తుకుంటా కానీ తప్పు చేయనని స్పీకర్ పోచారం కన్నీరు పెట్టుకున్నారు.

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం


కళాకారులను సన్మానిస్తున్న మండలి సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలో సోమవారం శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది రంగస్థల కళాకారులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు వి.మనోహర్‌రెడ్డి, శ్రీమిత్ర కళానాట్య మండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ మాట్లాడుతూ ప్రపంచరంగస్థల దినోత్సవం కళాకారులకు ఎంతో స్ఫూర్తివంతమైన రోజని అన్నారు. రంగస్థల నాటకరంగం వైభవం కోసం ఉమ్మడి జిల్లాలో వందలాది మంది కళాకారులు తమవంతు కృషి చేస్తున్నారని కొనియాడారు. నాటక రంగ కళాకారులకు ప్రభుత్వం మరింత సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళాకారులు ప్రభాకారాచారి, ఎస్.నర్సింలు, వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్, వెంకటేశ్వర్‌రావు, శంకర్‌రావు, మాదవరాజు, దామోదర్, గంగన్న, భరత్, కృష్ణయ్య, బొల్లంపల్లి కృష్ణయ్య, దత్తాత్రేయచారి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: రాజస్తాన్ రాష్ట్రం బన్స్‌వారాలో సోమవారం నుంచి ప్రారంభమైన జూనియర్ నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. అసిఫుల్లాబేగ్, కె.జాన్‌పాల్, ఎం.ఎ.ఖుషాంలు రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపికపై మహబూబ్‌నగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహ్మద్ జియావుద్దీన్, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ఒబేదుర్ రబ్, కోశాధికారి ముహిబుర్ రహెమాన్, కార్యనిర్వాహక కార్యదర్శి మహ్మద్ అహ్మద్ హుస్సేన్, ప్రదీప్‌కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.




ఎం.ఎ.ఖుషాం కె.జాన్‌పాల్ ఆసిఫుల్లా బేగ్

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని.. నియంతలుగా వ్యవహరించిన వారు కాలగర్భంలో కలిసిపోయారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రస్తుతం చీకటి రాజ్యం నడుస్తోందని.. గతంలో ఎన్నడూ కనీవినీ ఎరగని రీతిలో దౌర్భాగ్య పాలన కొనసాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పక్కదారి పట్టిస్తూ కార్పొరేట్లకు కొమ్ము కాస్తోందని ఆరోపించారు. వివిధ రాష్ట్రాల్లోని బీజేపేతర ప్రభుత్వాలను కూలదోసే పనిలో ఉందని.. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని పేర్కొన్నారు. మాట వినని ప్రతిపక్ష పార్టీలను ఇబ్బందులకు గురిచేసేందుకు ఈడీ, సీబీఐని వాడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతుకలను అణిచివేసేందుకు కేసులు నమోదు చేయించి వేధిస్తున్నారన్నారు. ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ, రైల్వే, స్టీల్, బీఎస్‌ఎన్‌ఎల్, సింగరేణి వంటి ప్రభుత్వ సంస్థలను అమ్మే హక్కు మోదీకి ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఉంటే మాతో ఉండు.. లేదంటే జైలులో ఉండు అనే నినాదంతో బీజేపీ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. పేదల సొమ్మును అదానికి ధారాదత్తం చేసి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. జేపీసీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ) వేయడానికి భయమెందుకని.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఎందుకివ్వరని ప్రశ్నించారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యలపై పోరాటంచేస్తామని తెలిపారు. ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పరమేశ్‌గౌడ్, బాలనర్సింహ, కొండన్న, బాలకిషన్, సురేష్ పాల్గొన్నారు.

పార్లమెంట్ వేదికగా ప్రశ్నిస్తున్నందుకే రాహుల్‌పై వేటు

ఏఐసీసీ కార్యదర్శి ఎస్ఎ.సంపత్‌కుమార్


దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాహుల్‌గాంధీ పార్లమెంట్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే ఎంపీ సభ్యత్వానికి అనర్హత వేటు వేశారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఎ.సంపత్‌కుమార్ విమర్శించారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదుట డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సంకల్ప సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. దీక్షలో పాల్గొన్న సంపత్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. 75ఏళ్ల భారత స్వాతంత్య్ర చరిత్రలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ లేవన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగానే రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారన్నారు. దేశంలోని ప్రజాసంపదను కొల్లగొడుతున్న విషయాన్ని పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ పదే పదే ప్రశ్నిస్తుండడం వల్ల ఆయనపై కక్షగట్టి అనర్హత వేటు వేశారని విమర్శించారు. ఈ చర్యను దేశంలోని ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి వాటికి కాంగ్రెస్ పార్టీ భయపడదని, న్యాయపరంగా ఎదుర్కొంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర వల్ల ప్రజల్లో మంచి స్పందన వచ్చిందని, దీనిని చూసి భయపడిన బీజేపీ ప్రభుత్వం రాహుల్‌పై అనర్హత వేటు వేసిందన్నారు. దీక్షకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంఘీభావం ప్రకటించి ప్రసంగించారు. నిరాహార దీక్షలో టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, ఎర్రశేఖర్, ప్రధాన కార్యదర్శులు ఎస్.వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, ప్రదీప్‌గౌడ్, నాయకులు జహీర్ అక్తర్, వసంత, బెక్కరి అనిత, సీజే బెనహర్, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, లక్ష్మీనారాయణ, అవేజ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి


మలిపెద్ది శంకర్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మన్ననూర్: ఆర్థిక పరిస్థితులు సరిగా లేని పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకోవడం కోసం రాష్ట్రస్థాయిలో శాశ్వత నిధిని ఏర్పాటు చేస్తూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ అన్నారు. సోమవారం శ్రీశైలం పుణ్యక్షేత్రం దర్శించుకుని తిరుగు ప్రయాణమైన ఆయనతో పాటు మన్ననూర్‌లో శ్రీశైలం నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి రంగయ్యగుప్తాను సంఘం రాష్ట్ర నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎడ్యుకేషన్ ట్రస్టు ద్వారా పేద విద్యార్థుల చదువుల కోసం ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. సంఘంలో శాశ్వత నిధి కోసం ఇప్పటికే రూ.3.5 కోట్లు జమ చేశామని, ఆ నిధిని రూ.5 కోట్లకు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో వెనకబాటుకు గురైన ఆర్యవైశ్యులకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. అలాగే రాష్ట్రస్థాయిలో మహిళా విభాగాలను ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు చేపడుతున్నామన్నారు. చట్టసభల్లో మనవంతు పాత్ర పోషించేందుకు రాజకీయంగా ఆర్యవైశ్యులు బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల స్థితిగతులను తెలుసుకోవడం కోసం ప్రస్తుతం అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సంబు వెంకటరమణ, కందికొండ శ్రీనివాసులు, సంబు శ్రీను, సత్యనారాయణ, నరేష్, రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థలను నిర్వీర్యం చేసిన బీఆర్‌ఎస్


మాట్లాడుతున్న ఈటల రాజేందర్

- సర్పంచ్‌లకు తెలియకుండా కేంద్రం నిధుల పక్కదారి
- ఉద్యోగాల భర్తీ కోసం వేచిచూస్తున్న 30లక్షల నిరుద్యోగులు
- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్

వనపర్తి క్రైం: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. సోమవారం వనపర్తికి వచ్చిన ఆయన జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం కావాలంటే.. స్థానిక సంస్థలు బలంగా ఉండాలన్నారు. కానీ, సీఎం కేసీఆర్ పాలనలో సర్పంచ్‌లకు బిల్లులు రాక.. చేతిలో అధికారం లేక కావలికారులుగా మారారని.. ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులను ఉత్సవ విగ్రహాలు చేశారని.. విసుగు చెందినవారు బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలోకి చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చే కేంద్ర ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టిస్తూ అభివృద్ధికి దూరం చేస్తున్నారని, చేసిన పనులకు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్న సర్పంచ్‌లు తెలంగాణలో ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యేలు లావ లాగ మండుతున్నారని.. గేట్లు తెరిస్తే ఎవరూ ఉండరన్నారు. జెడ్పీచైర్మన్, ఇద్దరు ఎంపీపీలు, 11 మంది సర్పంచ్‌లు, ఆరుగురు ఎంపీటీసీలు, ఇద్దరు మాజీ జెడ్పీటీసీలు, 5 మంది సింగిల్ విండో డైరెక్టర్లు.. వందలాది మంది నాయకులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారని, ఇది వనపర్తిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితి అని ఎద్దేవా చేశారు. పార్టీలకతీతంగా కేసీఆర్‌ను గద్దెదించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. అన్ని శాఖలపై పట్టుకోల్పోయిన కేసీఆర్ ఉంటే ఫాంహౌస్‌లో.. లేకుంటే ప్రగతి భవన్‌కు పరిమితమయ్యారని, అనేక పథకాలు తెచ్చి నవ్వులపాలయ్యాడని విమర్శించారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల భర్తీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఏడేళ్లుగా దళితులకు ఎకరా భూమి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ధరణి పేదల కొంపముంచిందని దుయ్యబట్టారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్ విషయంలో ప్రభుత్వానికి ఉన్న బాధ్యత ఏమిటో తేటతెల్లమయ్యిందని దుయ్యబట్టారు. యువత మనోధైర్యం కోల్పోవద్దని.. ధైర్యంగా బరిగీసి కొట్లాడాలని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగుల పక్షాన బీజేపీ నిలుస్తుందని, అందరం కలిసి ప్రభుత్వం మెడలు వంచుదామని పేర్కొన్నారు. మద్యంతో ఎంతో మంది మహిళల పుస్తెలతాళ్లు తెగుతున్నాయని, అది చాలక ఢిల్లీ లిక్కర్ స్కాంలో అడ్డంగా దొరికిన తన కూతురు కవితను కాపాడుకునేందుకు కేసీఆర్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పత్రికా స్వేచ్ఛను హరించేందుకు దాడులు చేసి, అక్రమ అరెస్ట్ చేస్తున్నారని.. ఈ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై, ప్రజలపై నమ్మకం పోయిందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు అశ్వత్థామరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రతాప్, న్యాయవాది మున్నూర్ రవీందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి, కృష్ణ, నారాయణ, బాశెట్టి శ్రీను, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఇండోర్ పరీక్షలు


పరీక్షలను పరిశీలిస్తున్న డీఐజీ చౌహాన్, ఎస్పీలు

జడ్చర్ల: జడ్చర్లలోని డీటీసీ కేంద్రంలో సోమవారం చార్మినార్ జోన్, యాదాద్రి జోన్ పరిధిలోని ఏడుగురు హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి రావడంతో ఇండోర్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ కె.నరసింహ, నల్లగొండ ఎస్పీ అపూర్వరావు, ఏఎస్పీ రాములు, 12వ బెటాలియన్ సాంబయ్య పాల్గొన్నారు.